www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 4 నవంబర్ 2025



బాలికలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని భీమనపల్లి పంచాయతీ సింగరాయపాలెంకు చెందిన బొక్కా ప్రమీల, కదలి సత్యదుర్గ చరణ్ల తల్లిదండ్రులను కోల్పోయి అనాధలుగా మిగిలారు. సోమవారం ఎస్ఎఫ్ మండల అధ్యక్షులు విత్తనాల సత్యనారాయణ బాలికలకు రూ.10 వేలు, దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. బాలికలకు సాయం చేసిన సత్యనారాయణకు బాధితులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుత్తుల నాగేశ్వరరావు, శీలం భాస్కరరావు, గుత్తుల వెంకటేశ్వరరావు, కుక్కల శ్రీను, మట్టపర్తి ధనుంజయ్, పాటి వెంకటేశ్వరరావు, గుత్తుల త్రినాథ్ పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న సత్యనారాయణ

కొండెక్కిన కూరగాయలు

- అనూహ్యంగా పెరిగిన ధరలు
- నాలుగు రెట్లు పెరిగిన టమాట
- ఘాటెక్కిన పచ్చిమిర్చి
- గతేడాదితో పోలిస్తే అధిక ధరలు

ప్రజాశక్తి - రాజోలు

కూరగాయల ధరలు కొండెక్కాయి. కొనాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. నెల రోజుల్లో టమాట 4 రెట్లు పెరగ్గా, మిగతా కూరలు 40 నుంచి 50 శాతం పెరిగాయి. పచ్చిమిర్చి ముట్టుకుంటే ఘాటెక్కుతున్నది. టమాట రూ.120కి చేరుకుంది. మేమేం తక్కువ అన్నట్టు అన్ని కూరగాయల ధరలు వాటి వెంటే కొండెక్కి కూర్చున్నాయి.

నెల రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం డబుల్ అవడంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మార్కెట్‌కు ఐదు వందల నోటుతో వెళ్లితే.. సగం సంచి కూడా నిండడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో కిలో కొనేవారు, పావుకిలో సరిపెట్టుకుంటున్నారు. కూరగాయల సాగు తగ్గిపోవడం, వర్షాలతో తోటలు దెబ్బతినడం వల్ల ఈ పరిస్థితికి కారణమని తెలుస్తుంది. మార్కెట్‌కు ఎక్కవగా దిగుబడి వస్తే ధరలు అదుపులోకి వస్తాయని వ్యాపారులు అంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంటే ఎంతో కొంత తక్కువ ధరలకు లభిస్తాయనుకుని రైతుబజారుల్లో సైతం ధరలు ఎక్కువగానే ఉంటున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండించే రైతుకు ఎంత వరకు గిట్టుబాటు ధర లభిస్తోందో గానీ.. దళారులు మాత్రం బాగుపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సామాన్యులకు తప్పని కన్నీళ్లు

సామాన్యుడు రూ.500 తీసుకుని మార్కెట్‌కు వెళ్తే పట్టుమని 4 రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది.

కొనాలంటేనే భయమేస్తోంది

మార్కెట్‌లోనే కాదు.. వారాంతపు సంతలో కూరగాయలు కొనాలంటే భయమేస్తోంది. ఎప్పుడూ లేనివిధంగా వ్యాపారులు కూరగాయల ధరలు పెంచేశారు. నోటికి రుచికరంగా చేసుకుందామంటే ధరలు మండిపోతున్నాయి. రూ.500 తీసుకుని వెళితే సగం సంచి నిండడం లేదు. పెరుగుతున్న కూరగాయల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-బుంగ సత్యనారాయణ ,బి.సావరం,రాజోలు



పచ్చిమిర్చి ధర రూ.100-120 చేరి అందనంత ఎత్తులో ఉంది. జిల్లాలోని పలు మండలాల్లోని వారంతపు సంతలు, వీధి దుకాణాల్లో సైతం కూరగాయల ధరలు పెరిగిపోవడంతో వాటిని కొనలేని పరిస్థితి నెలకొంది. నెల రోజుల క్రితం టమోట ధర రూ.10 నుంచి రూ.20 ఉండగా, నేడు ఏకంగా రూ.70 నుంచి రూ.90 వరకు చేరింది. నిత్యం కూరల్లో ఉపయోగించే ఉల్లిపాయలు గతంలో రూ.25 ఉండగా నేడు ఒక్కసారిగా రూ.60కి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. బీరకాయ, గోరుచిక్కుడు, వంకాయ, కాకర కాయ, చిక్కుడు, బీట్‌రూట్, క్యారెట్, క్యాబేజీ, బీన్స్, ముల్లంగి తదితర కూరగాయల ధరలు రూ.80-100 మధ్య ఉండడంతో ప్రజలు బెంబెలెత్తుతున్నారు. ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మంచివని వైద్యులు చెప్పడంతో వాటి ధరలు పెరిగిపోవడంతో కొనలేకపోతున్నారు. మెంతి, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటివి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఆదివారం వస్తే మాంసంలోకి కచ్చితంగా వాడే పుదీనా, కొత్తిమీర, అల్లం వంటివి ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు కొనాలంటే ఆందోళనకు గురవుతున్నారు. కూరగాయలు, ఆకుకూరల ధరల గురించి వ్యాపారులను అడిగితే పంటలు పండడం లేదనే సాకుతో మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని చెప్పి సామాన్యులను దోపిడీ చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ధరల నియంత్రించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్తీక మాసాన.. ధరలు ఆకాశాన,,

వర్షాల నెపంతో వ్యాపారులు కూరగాయల ధరలను అమాంతంగా పెంచేశారు. మరోవైపు కార్తీక మాసం కలిసి రావడంతో కూరగాయలకు భారీగా డిమాండ్ నెలకొంది. ఈ మాసంలో గృహ ప్రవేశాలు, వివాహాలు లాంటి శుభ కార్యాలు ఎక్కువగా ఉండటంతో పచ్చిమిర్చి, క్యారెట్, టమాట, బీన్స్, చిక్కుడు, వంకాయ, బీరకాయ లాంటి కూరగాయల ధరలన్నీ భారీగా పెరిగాయి. ఆకు కూరల ధరలు సైతం బాగా పెరిగాయి. జిల్లా అవసరాలకు సరిపడా కూరగాయలన్నీ దాదాపు ఇతర ప్రాంతాల నుంచే దిగుమతి అవుతున్నాయి. దీంతో వ్యాపారులు ఇష్టం వచ్చిన ధరకు అమ్ముతూ సామాన్యుల జేబులు లూటీ చేస్తున్నారు. ధరల పెరుగుదలపై ప్రజలకు అండగా నిలిచి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాల్సిన కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తుండడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. కష్ట కాలంలో ప్రభుత్వం ఆదుకోవడం లేదని మండిపడుతున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీదారులతో సంబంధిత అధికారులు నేరుగా మాట్లాడాలని చెప్పారు. సక్రమవిధంగా ఎండార్స్‌మెంట్లు ఇవ్వాలని, అర్జీదారులతో అధికారులు ప్రవర్తన విషయంలో మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చేలా చిత్తశుద్ధి, క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. పిజిఆర్ఎస్‌కు వచ్చిన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం లభించేలా కృషి చేయాలని అన్నారు. మార్గదర్శకాలు పాటించడంలో ప్రవర్తన పరంగా కొందరు అధికారులలో లోపాలు కనిపిస్తున్నాయని వీటిని సరిదిద్దుకోవాలన్నారు. వీటిని సరిదిద్దు కోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదుల ఆడిటింగ్ నక్షమంగా పూర్తిచేయాలని, సమస్య పరిష్కార అధికారి గ్రీవెన్స్ రెడ్రెస్సల్ అధికారి స్వయంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని చెప్పారు. అర్జీదారుల నుంచి వచ్చిన ప్రతి ఫీడ్ బ్యాక్‌ను నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారికి సూచనలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తమ సిబ్బంది ద్వారా నిర్ణీత గడువు లోపుగానే పరిష్కారం చూపాలన్నారు. ఒక్కోసారి ఫిర్యాదు పరిష్కారానికి కొంత సమయం అవసరం ఉన్నప్పుడు సంబంధిత విషయాన్ని ఫిర్యాదుదారులకు స్వయంగా అధి కారులు మాట్లాడాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెనువెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని, అర్జీలు రీఓపెన్ కాకుండా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఎస్పి రాహుల్‌మీనా, డిఆర్ఒ కె.మాధవి, డిపిఒ శాంతలక్ష్మి, డిఎల్‌డిఒలు రాజేశ్వరరావు, వేణుగోపాల్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.ప్రభాకర్, డిఇఒ షేక్ సలీంభాష, డిఎస్ఒ అడపా ఉదయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశ్వ విజేత మహిళా జట్టుకు మంత్రి ప్రశంసలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రతిష్టాత్మకంగా జరిగిన మహిళల క్రికెట్ ప్రపంచకప్-2025 ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై టీమిండియా జట్టు చారిత్రక విజయాన్ని సాధించడం పట్ల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యావత్ దేశం గర్వపడేలా మహిళలు అద్భుతమైన ప్రదర్శనతో ఈ ఘనతను సాధించారని ప్రశంసించారు. ప్రపంచ దేశాలు ఆశ్చర్యపడేలా అద్భుతమైన ప్రదర్శన, అలుపెరుగని పోరాటం, ప్రతీ భారతీయుడికీ స్ఫూర్తినిస్తాయన్నారు.

కొత్తూరులో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని కొత్తూరులో నిర్మించిన స్వర్గీయ ఎన్‌టిఆర్ విగ్రహన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ టిడిపిని స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. తెలుగు వారి కీర్తిని ప్రపంచానికి సాటి చెప్పిన ఘనత ఎన్‌టిఆర్‌దేనని అన్నారు. ఆశయ సాధనలో నేటితరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆ మహనీయుని స్మరించుకుంటూ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక టిడిపి నాయకులు గరికపాటి సూర్యనారాయణ, గ్రామ పెద్దలను ఆయన అభినందించారు. ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పేదలకు కిలో రూ.2కే బియ్యం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎంపి చుండ్రు శ్రీహరిచౌదరి, సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, ఎఎంసి ఛైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - అమలాపురం

ఐ.పోలవరం మండలం బాణాపురంలో పదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈ అమానుష ఘటన మానవ సమాజానికి సిగ్గుచేటన్నారు. బాలికల భద్రతకు భంగం కలిగించే ఇటువంటి చర్యలు అత్యంత హేయమైనవని అన్నారు. తుని ఘటన మరువక ముందే ఇటువంటి ఘటన జరగడం బాధాకరమని, ఈ ఘటనను అందరూ ఖండించాలని అన్నారు. నిందితుడు రాయపూడి సత్యవెంకటకృష్ణ కఠినంగా శిక్షించాలని, ఇటువంటి పైశాచిక చర్యలకు పాల్పడేవారికి సమాజంలో స్థానం లేదని రీతిలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలికకు మెరుగైన వైద్యం, మానసిక ధైర్యం అందించాలని కోరారు. ఇదే గ్రామంలో నిందితుడు మరికొంత మంది బాలికలపై అత్యాచారాలకు పాల్పడినట్లు సమాచారం వస్తుందని, పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, కార్యదర్శి ఎన్.బలరాం, కోశాధికారి కె.కృష్ణవేణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్, యుటిఫ్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు శెట్టిబత్తుల తులసిరావు, బిఎస్‌పి నియోజకవర్గ నాయకులు పి.మోహన్‌బాబు, ఎస్‌టి ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు బంగారు రాజు, రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఎం. వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు కె.సత్తిబాబు, జిల్లా కార్యదర్శి రాజేంద్ర, బొంతు రమణ, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్యదర్శి జి.దైవకృప, డి.ఆదిలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎ.రవి, కెవిపిఎస్ లీగల్ అడ్వజర్ జిత్తుక సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దీప్తి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మామిడికుదురు

విజయవాడలో ఆదివారం జరిగిన 9వ జాతీయ కుంగ్ ఫూ పోటీలలో మామిడకుదురు దీప్తి స్కూల్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభను చాటారు. సబ్ జూనియర్ విభాగంలో 2వ తరగతి విద్యార్థి ఓదూరి మనోజ్ఞశ్రీ మొదటి స్థానం, జూనియర్ కటాస్ విభాగంలో 6వ తరగతి విద్యార్థి కడలి శ్యామ్యశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రతిభను చాటిన విద్యార్థులను కరస్పాండెంట్ డివివి.సత్యనారాయణ, హెచ్ఎం యక్కల దేవర నాగన్నబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభను చాటిన విద్యార్థులు

బాధిత కుటుంబాలకు పరిహారం అందజేత

ప్రజాశక్తి - అమలాపురం రూరల్, ముమ్మిడివరం

మొంథా తుపాను ప్రభావంతో పునరావస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన బాధితులకు ప్రభుత్వం అందించిన సాయాన్ని అందజేశారు. అమలాపురం రూరల్ మండలంలోని కామనగరువు పునరావస కేంద్రంలో ఆశ్రయం పొందిన బాధితులకు సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు, విఆర్ఒ అందజేశారు. అలాగే ముమ్మిడివరం మండలంలోని సిహెచ్ గున్నేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గొలకోటి దొరబాబు ఆధ్వర్యంలో 35 బాధితులకు నగదు సాయంతో పాటు, నిత్యావసర సరుకులను ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాము హేమకుమారి, యాళ్ళ ఉదయ్, సఖిలే వెంకటేశ్వరరావు, శీలం సత్తిబాబు, తాతాజీ, పంచాయతీ సెక్రటరి హిమబిందు, విఆర్ఒ శ్రీను పాల్గొన్నారు.



సాయాన్ని అందిస్తున్న ఎంఎల్‌ఎ దాట్ల

పంట నష్టం నమోదు పూర్తి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మొంథా తుపాను ప్రభావంతో మండలంలోని వరి పంట చేలకు జరిగిన పంటనష్టం నమోదు పూర్తయిందని వ్యవసాయ శాఖ ఎఒ బి.రవి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల జాబితాను ఆర్ఎస్‌కెల ప్రదర్శించాలని సిబ్బందికి సూచించారు. తమ గ్రామాల పరిధిలో ఉన్న ఆర్ఎస్‌కెల వద్ద రైతుల జాబితాలో తమ పేరు లేనట్లయితే అగ్రికల్చర్ అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు. బాధిత రైతుల ఆధార్ కార్డుతో అనుసంధానం అయిన బ్యాంక్ ఖాతాకు ప్రభుత్వ పరిహారం జమ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సచివాలయ వ్యవసాయ సహాయ అధికారులు బాలసాయి, నాగబాబు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎఒ రవి

మాలల సంక్షేమం, అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రాజోలు

మాలల సంక్షేమ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో గెడ్డం సింహ అధ్యక్షతన మాలల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలు ఐక్యతతో ఉండాలని పిలుపునిచ్చారు. మాలలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కులవృత్తి లేకుండా సమాజ హితం కోసం పోరాడేది మాలలే అని అన్నారు. జాతి కోసం పని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నియోజకవర్గంలో దళిత కాలనీల అభివృద్ధికి, సంక్షేమం కొరకు కృషి చేస్తానన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గెడ్డం తులసీ భాస్కర్, సరెళ్ల విజయప్రసాద్, బత్తులు లక్ష్మణరావు, దేవ రాజేంద్రప్రసాద్, చింత రాజబాబు, గెడ్డం మహలక్ష్మి, తాడి మోహన్, రాపాక మహేష్, పొలమూరి శ్యాంబాబు, బత్తుల మురళీకృష్ణ, నక్కా రామారావు, బందెల పద్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్

నిర్మాణ పనులకు భూమి పూజ


ప్రజాశక్తి - అంబాజీపేట

మండలంలోని తొండవరం వెన్నపు వారి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సమగ్ర శిక్ష సివిల్ వర్క్స్ పనులకు భూమి పూజ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్‌పిటిసి బూడిద వరలక్ష్మి, సర్పంచ్ పి.రామలింగరాజు పాల్గొని శంకుస్థాపన చేశారు. రూ.9,37,500లతో 125 మీటర్ల ప్రహరీ గోడ, రూ.3.80 లక్షలతో బాలుర మరుగుదొడ్లు, రూ.6 లక్షలతో పాఠశాల మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వి.దొరబాబు, ఎంఇఒలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, క్లస్టర్ ఛైర్మన్ కె.సాయిరాం, ఎస్ఎంసి ఛైర్మన్ బి.దుర్గారావు, హెచ్ఎం కేశవాచార్యులు, మండల జెఇ వి.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి లోవరాజు, హెచ్ఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కార్టూ'నిజం'



ప్రగతిపథంలో ముంగండపాలెం పంచాయతీ

ప్రజాశక్తి - పి.గన్నవరం

గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో ముంగండ పాలెం పంచాయతీ ప్రగతి పథంలో నడిచిందని సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు తెలిపారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. గ్రామంలో సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో సిసి రోడ్లు, వాటర్ ట్యాంకులు, తాగునీటి పైపులైన్లు, పాంచాల రేవులు, డ్రెయినేజీలు నిర్మాణం చేసినట్లు తెలిపారు. గడపగడపకూ కార్యక్రమంలో గాజులగుంట, పెదపాలెం, అడ్డపుంతలలో రూ.15 లక్షలతో మూడు సిసి రోడ్లు, జడ్‌పి నిధులు రూ.5 లక్షలు, ఉపాధి హామీ చట్టం నిధులు రూ.20 లక్షలు, పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో బిసి కాలనీలలో సిసి రోడ్డు నిర్మించామని చెప్పారు. వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పాంచాల రేవు వరకు రూ.2 లక్షలతో సిసి రోడ్డు, గాడ ఏసు ఇంటి నుంచి అడబాల కోటేశ్వరరావు ఇంటి వరకు మండల పరిషత్ నిధులు 2 లక్షలు, ముంజవరపుకొట్టు గునిశెట్టి సూర్యనారాయణ ఇంటి వద్ద నుంచి గునిశెట్టి దుర్గారావు ఇంటి వరకు పంచాయతీ నిధులు రూ.2 లక్షలతో, 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలతో నక్కా శివన్నారాయణ - అప్పన కోటయ్య ఇంటి వరకు సిసి రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. మండల పరిషత్ నిధులు రూ. 2 లక్షలతో ఉలిశెట్టి వారి పాలెంలో డ్రెయిన్, రూ.లక్షతో పాంచాలరేవు నిర్మాణం చేశామన్నారు. సుమారు రూ.34.49 లక్షలు వ్యయంతో గాజుల గుంటలో వాటర్ ట్యాంక్, ఉలిశెట్టివారిపాలెంలో వాటర్ ట్యాంక్, కొత్త పైపులైన్‌లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ నిధులు ఉలిశెట్టివారిపాలెంకు రూ.7 లక్షలు, గాజులగుంటలో రూ.13 లక్షలు, అడ్డపుంతలో రూ.7 లక్షలు మొత్తం 27 లక్షలు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. మరో రూ.3 కోట్ల అంచనాలతో గాజులగుంట రోడ్డు, శ్మశాన వాటికి, మరో వివిధ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు కార్యరూపం దాల్సితే పూర్తి స్థాయిలో గ్రామాభివృద్ధి సాగుతోందని సర్పంచ్ తెలిపారు.



సర్పంచ్ లక్ష్మణరావు



ఎంఎల్‌ఎ సత్యానందరావును సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చిన్నపరిశ్రమల స్థాపనకు తోడ్పాటు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానికంగా లభ్యమయ్యే వనరులతో చిన్న పరిశ్రమలను స్థాపించేందుకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తాదని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు తెలిపారు. సోమవారం మండలంలోని చెముడులంకలో ఎంఎస్ఎంఇ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ యువత, మహిళలు పారిశ్రామికాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. కొబ్బరి, అరటి వంటి పంటల ఉప ఉత్పత్తులతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ముడిసరుకు సమృద్ధిగా లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహిస్తుందని చెప్పారు. అనంతరం సేవా అవార్డును అందుకున్న ఎంఎల్‌ఎను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సాయిజయచంద్ర, ఇండస్ట్రియల్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పి.కేశవవర్మ, ఎన్ఇపిడిఎ జోనల్ మేనేజర్ టి.శ్రీనివాసరావు, నాబార్డ్ బ్యాంక్ మేనేజర్ స్వామినాయుడు, ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ ప్రకాష్ బాబు, సొసైటీ ఛైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, డిసి ఛైర్మన్ మెర్ల గోపాలస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఒకేషనల్ స్కిల్ కాంపిటేషన్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఒకేషనల్ స్కిల్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని సోమవారం అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం బివి.రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జిసిడిఒ భీమరావు, డిస్ట్రిక్ విసి రమేష్, విటి రాజేశ్వరరావు, జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంపిటీషన్‌ను రెండు విభాగాలుగా విభజించి నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఒక ప్రథమ స్థానం, అగ్రికల్చర్ విభాగంలో ప్రథమ స్థానంగా నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్తమ ప్రాజెక్టులు చేసిన విద్యార్థులు జిల్లా స్థాయిలోనూ రాణించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రుక్మిణి, సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న నిర్వాహకులు

వైద్య సేవల బలోపేతానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిల్లో వైద్య సేవలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి విభాగం ఇంజనీర్లతో సమావేశం జరిగింది. అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో నెలకు సుమారు 120 ప్రసవాలు మాత్రమే నిర్వహించడం పట్ల ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. నెలకు సుమారుగా 1500 ప్రసవాలు నిర్వహించేలా ప్రసూతి వైద్య సేవల విభాగం, గర్భిణీల పడకల సంఖ్య, మాతా శిశు సంరక్షణ బ్లాకు నవజాత శిశువుల ప్రత్యేక విభాగం, చిన్నారుల వైద్య సేవల బ్లాకుల బలో పేతం చేయాలని ఆదేశించారు. సరైన వసతులు అందుబాటులో లేక పేద ప్రజానీకం ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి ప్రసవ సమయంలో గర్భిణులకు సిజేరియన్లు ఎక్కువగా నిర్వహించడం పట్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల ఆసుపత్రిలోని పలు విభాగాలలో జిల్లా స్థాయి అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

తనిఖీలు నిర్వహించినప్పటికీ ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రి మూడో అంతస్తులోనూ బ్లాకులు నిర్మించి వైద్య సేవలను బలోపేతం చేయాలని సూచించారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒపి సేవల్లో వృద్ధి సాధించి పవిత్రమైన వైద్య వృత్తి ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాటుపడాలన్నారు. వైద్య సిబ్బంది హాజరు, డయాగ్నొస్టిక్ సర్వీసుల మెరుగుదలతో పాటు ఆధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకుని వైద్య సేవల నాణ్యత పెంచేందుకు ప్రభుత్వం పలు ప్రణాళికలు అమలు చేయిస్తోందన్నారు. ప్రాంతీయ ఆసుపత్రుల్లో అదనపు సౌకర్యాలు, సూపర్ స్పెషాలిటీ సేవలు, అత్యవసర సేవలు అందుబాటులోకి తీసుకువచ్చే నిర్మాణ సదుపాయాలు కల్పన పనులు చేపట్టాలన్నారు. ప్రజలలో ప్రభుత్వ వైద్య సేవల పురోగతిని తెలియ జేసి, వైద్య సేవల పట్ల విశ్వసనీయతను పెంచాలన్నారు. నాణ్యమైన వైద్య సేవలు అందించడం వల్ల వైద్య సేవ పై విశ్వాసం పెరిగి, ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించి స్ఫూర్తి దాయకమైన ఉచిత ఆరోగ్య సేవలు పొందగలుగుతారన్నారు. ఆరోగ్య సేవలో మౌలికోసతుల కల్పన ఇంజనీర్లు ఆసుపత్రి ప్రాంగణాన్ని సందర్శించి వైద్య వసతులు కల్పనకు సిబ్బంది నివాస క్వార్టర్ల నిర్మాణానికి అధ్యయనం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్య క్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ సిహెచ్.రతన్‌రాజు, డిఇ ఎం.చక్రవర్తి, డిఎంహెచ్ఒ ఎం.దుర్గారావుదొర, డిసిహెచ్ఎస్ కార్తీక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్రావు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

శ్రీను కుటుంబానికి మంత్రి, ఎంపీ పరామర్శ

ప్రజాశక్తి - అమలాపురం

ఇటీవల హత్యకు గురైన కంచిపల్లి శ్రీను కుటుంబాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపి హరీష్ మాధుర్ సోమవారం పరామర్శించారు. శ్రీను కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ వైసిపి గుండాలు రెండేళ్లకో హత్య చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కాసుబాబు లాంటి వైసిపి గుండాలకు వెన్నులో వణుకు పుట్టిస్తామన్నారు. బెయిల్‌పై బయటకు వచ్చిన తరువాత ఎటువంటి అలజడికి గురిచేసినా, ఎవరైనా వారికి స్వాగత ఫ్లెక్సీలు కట్టినా రౌడీ షీట్ ఓపెన్ చేయిస్తానని సుభాష్ హెచ్చరించారు. ఈ పరామర్శలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, వెంకటేశ్వర దేవస్థానం ఛైర్మన్ కంచిపల్లి అబ్బులు, మాజీ ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, కౌన్సిలర్ చిక్కాల రాంబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని చింతపల్లిలంక గ్రామానికి 17 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. ఈ మేరకు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం..గుడికి వెళ్ళి వస్తానని ఈ నెల ఒకటో తేదీన సదరు బాలిక ఇంటి దగ్గర చెప్పి బయటకు వెళ్లింది. నాటి నుంచి ఆమె తిరిగి రాకపోవడంతో బంధువులు, బాలిక స్నేహితుల ఇళ్ల వద్ద గాలించారు. అయినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆ బాలిక ఆచూకీ తెలిసిన వారు సెల్ నెంబర్లు 94407 96564, 94407 96528, 89852 54749లకు సమాచారం అందించాలని కోరారు.



విజిలెన్స్ అధికారులు దాడిలో పట్టుబడిన అక్రమ బియ్యం

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ టి.నాగరాజు నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా టాటా ఏసి వాహనంలో తరలిస్తున్న 4,600 కిలోల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం పెనుమాదం నుంచి జొన్నాడ వైపు 4,600 కిలోల బియ్యాన్ని తరలిస్తున్న జక్కంశెట్టి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని వేములపల్లి ఎంఎల్ఎస్ పాయింట్ గొడౌన్‌కు అప్పగించారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.చంటి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు వెంకటరాజు, ఎజి లక్ష్మీనారాయణ, ఎంఎస్ఒ పి.వెంకటేశ్వరరావు, సిబ్బంది లోవరాజు, వల్లీ పాల్గొన్నారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం ముగ్గళ్ళ గ్రామంలో రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఇనుగంటి వారి పేట నుంచి కోరుకొండ తరలిస్తున్న ఈ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కోరుకొండ పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ నాగలక్ష్మికి సమాచారం అందించారు. నాగలక్ష్మి ఈ వాహనాన్ని సీజ్ చేశారు. 6ఎ కేసు నమోదు చేశారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి చెందిన తలారి వీరబాబు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలు ఉంటే వెంటనే జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సమాచారం ఇవ్వాలన్నారు.

గుర్తు తెలిని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - అంబాజీపేట

వాకలగరువు పుష్కరాల రేవులోకి కొట్టుకు వచ్చిన గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవికి సమాచారం అందించగా సంఘటనా స్థలానికి వెళుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో విద్యుత్ వైర్లు దగ్ధం

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక కౌశిక రోడ్డులో జరిగిన అగ్నిప్రమాదంలో విద్యుత్ వైర్లు దహనం అయ్యాయి. సోమవారం విద్యుత్ స్తంభం పక్కన ఉన్న చెత్త కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న వైర్లకు మంటలు వ్యాపించాయి. పెద్దఎత్తున పొగ, మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో విద్యుత్ శాఖ ఎఇ ఎస్.రామకృష్ణ అప్రమత్తమై ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం వెళ్లడంతో హుటాహుటీనా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గజ్జరం గ్రామానికి చెందిన గన్నిన నరసమాంబ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అపరిచిత వ్యక్తులు వచ్చారు. టివి రిపేరు ఉందని కంప్లైంట్ వచ్చిందని, దాన్ని రిపేరు చేయడానికి వచ్చామని నమ్మబలికారు. టివి బాగానే ఉందని ఆమె బదులిచ్చింది. 'మీ ఇంటికి వచ్చినట్టుగా టివి పక్కన ఫోటో తీసుకోవాలి' అని నిందితులు తెలిపారు. దీంతో వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. ఇదే సమయంలో మరికొంత మంది లోనికి వచ్చి ఆమె బెడలో బంగారు గొలుసు లాక్కుని బ్లూ కలర్ మోటార్ బైక్‌పై పారిపోయారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కొవ్వూరు డిఎస్‌పి ఆదేశాలతో కొవ్వూరు రూరల్ ఎస్ఐ విజయబాబు పర్యవేక్షణలో కొవ్వూరు క్రైమ్ స్టేషన్ ఎస్ఐ రవీంద్ర, తాళ్లపూడి ట్రైనీ ఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్ దర్యాప్తు చేపట్టారు. సోమవారం మండలంలోని బల్లిపాడు గ్రామం వద్ద దొంగలించిన బంగారం, పారిపోయిన మోటార్ బైకుతో షేక్ సుభానిజానీ, దేశగిరి గంగరాజు, వడ్డీ శరన్‌రాజు గుర్తించి పట్టుకున్నారు. వారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

హుండీల్లో నగదు చోరీ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని మల్లవరం గ్రామంలో ఉమామల్లేశ్వరవు స్వామి ఆలయంలో హుండీల్లో నగదు చోరీకి గురైంది. ఆలయ కమిటీ సభ్యుల కథనం ప్రకారం ఉమామల్లేశ్వరవు స్వామి ఆలయంలోని మూడు హుండీలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి సొమ్మును అపహరించారన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఉద్యోగులకు సేవా అవార్డులు

తుపాను సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి సోమవారం సేవా అవార్డులను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఎస్‌పి రాహుల్‌మీనా అందజేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

అమలాపురం స్థానిక కలెక్టరేట్‌లో తుపాను సమయంలో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సేవా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత సంసిద్ధతతో కోనసీమ తీర ప్రాంత విపత్తులను ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మొంథా తుపాను నేపథ్యంలో అంకితభావంతో కూడిన సేవ, నాయకత్వం సంసిద్ధతలో అవిశ్రాంత కృషి చేస్తూ ఆస్తి ప్రాణ నష్టాలకు తావు లేకుండా చేపట్టిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ప్రశం సా పత్రాలను వివిధ కేడర్లకు చెందిన 185 మంది ప్రభుత్వ ఉద్యోగులకు అందజేసినట్లు తెలిపారు. ఐదు రోజులపాటు తుపాను హెచ్చరికల నేపథ్యంలో సుమారు 65 శాఖలు ఆస్తి, ప్రాణ నష్టా లు తగ్గించడంలో కీలకంగా వ్యవహరించాయన్నారు. ఈ కార్య క్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా, డిఆర్ఓ కె.మాధవి, ఆర్‌డిఒలు పి.శ్రీకర్, డి.అఖిల జిల్లా అధికారులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** మొంథా తుపాను సమయంలో అందించిన సేవలకు గుర్తిస్తూ ఆర్‌డిఒ డి.అఖిల సేవా అవార్డును అందుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ అఖిలతోపాటు, రాయవరం తహశీల్దార్ బివి.భాస్కర్‌లకు కలెక్టర్ ఉత్తమ సేవా అవార్డులను అందజేశారు. **మామిడికుదురు** మండల పరిధిలో ఉత్తమ సేవలందించిన పలువురు ఉద్యోగులకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అవార్డులు అందజేశారు. తహశీల్దార్ పి.సునీల్ కుమార్, ఎంపిడిఒ జి.భవాని, నగరం పిహెచ్‌సి స్టాఫ్ నర్స్ యల్లమెల్లి సుమ అవార్డులు అందుకున్నారు. **అంబాజీపేట** పి.గన్నవరం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రుద్రరాజు భీమరాజు ఉత్తమ సేవా అవార్డును కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్‌పి రాహుల్ మీనా చేతుల మీదుగా అందుకున్నారు. **కొత్తపేట** కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్, తహశీల్దార్ వై.రాంబాబు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డులను అందుకున్నారు. **ముమ్మిడివరం** నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ ఉత్తమ సేవా అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రవివర్మను నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది అభినందించారు. **ఉప్పలగుప్తం** ఎంపిడిఒ డి.కృష్ణ సేవా అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆయనను డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, కార్యాలయ ఎఒ భూపతిరాజు తులసికృష్ణ, ఉపాధి ఎపిఒ ఎం.వీరబాబు, కార్యాలయ సిబ్బంది అభినందించారు. అలాగే మండల డిప్యూటీ తహశీల్దార్ జి.లలిత కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను తహశీల్దార్ విఎస్.దివాకర్, ఆర్ఐ జి.నాగూర్ మీరా సాహెబ్, విఆర్ఒలు అభినందించారు. అలాగే మండలంలోని ఎస్.యానం గ్రామపంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి బి.గోవిందరావు అవార్డును అందకున్నారు. ఈ సందర్భంగా గోవిందరావును సర్పంచ్ జోగి రాజేశ్వరి, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.



కలెక్టరేట్ ఎఒ కాశీ విశ్వేశ్వరరావు



సిసి సర్వేశ్వరరావు



ఆర్‌డిఒ అఖిల



స్టాఫ్ నర్స్ సుమ



సిఐ భీమరాజు



ఆర్‌డిఒ శ్రీకర్



కమిషనర్ రవివర్మ



ఎంపిడిఒ డి.కృష్ణ



డిప్యూటీ తహశీల్దార్ లలిత



కార్యదర్శి గోవిందరావు

ఐసిటిసి వాహన సేవలు కీలకం

ప్రజాశక్తి - అమలాపురం

గ్రామీణ, దూర ప్రాంతాల ప్రజలకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై సేవలందించేందుకు సంచార ఐసిటిసి వాహన సేవలు కీలకంగా మారనున్నాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణకు కొత్త సంచార ఐసిటిసి వాహన సేవా వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార ఐసిటిసి వాహనం ఇంటింటికి వెళ్లి కౌన్సెలింగ్, టెస్టింగ్ అవగాహన కార్యక్రమాలను అందించనున్నదని తెలిపారు. ఈ సేవ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన, నిష్పక్షపాత హెచ్ఐవి పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పించి, ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని తగ్గించడానికి సహాయపడుతుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర మాట్లాడుతూ సంచార హెచ్ఐవి కౌన్సిలింగ్ పరీక్ష కేంద్రాల కేంద్రాన్ని జిల్లాకు కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో వైద్య కేంద్రాలకు దూరంగా ఉండి హెచ్ఐవి సర్వీసెస్ అందుకోలేని ప్రదేశాలకు హై రిస్క్ జనాభా ఉన్న ప్రదేశాలకు, పారిశ్రామిక కేంద్రాలలో పని



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

చేస్తున్న వలస కూలీలకు జిల్లాలోని పాజిటివ్స్ తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలలో ఈ మొబైల్ ఐసిటిసి సంచార వాహనం సేవలందిస్తుందన్నారు. కావున జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఈ కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్ఒ సిహెచ్‌వి.భరత్‌లక్ష్మి, డిసిహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్, టెక్నికల్ నిపుణులు దిశ, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ ఎ.బుజ్జిబాబు, ఎంవి. రథంరాజు, దిశ, రామానాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

గోగన్నమఠం గ్రామానికి చెందిన బొలిశెట్టి శ్రీవెంకట రాజ్‌కుమార్ మోహనాంజలి దంపతులు, వారి కుటుంబ సభ్యులు అప్పనపల్లి బాల బాలాజీ శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.10,116, అమలాపురంకు చెందిన ఆరెపు చైతన్యకుమార్,సూర్యనిఖి దంపతులు అన్న ప్రసాద ట్రస్ట్‌కు రూ.10 వేలు విరాళం అందించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాన్ని అందజేశారు.



దాతలకు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న దేవస్థానం ప్రతినిధులు

ఆయిల్ బాల్స్‌తో దోమల నివారణ

ప్రజాశక్తి - మామిడికుదురు

మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వదలడంతో దోమలను నివారించవచ్చునని లూటుకుర్రు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.సత్యవతి అన్నారు. సోమవారం పిహెచ్‌సి పరిధిలోని దీప్తి డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని, డెంగీ, మలేరియా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమ గుడ్డు లార్వా అరికట్టేందుకు పల్లపు ప్రాంతాలలో అయిల్ బాల్స్ వేయడం ద్వారా లార్వాను పూర్తిగా



విద్యార్థులకు ఆయిల్ బాల్స్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమరాడ పంచాయతీ సెక్రెటరీ ఎస్.నాగమణి, హెల్త్ అసిస్టెంట్ కొమ్మూరి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వరల్డ్ కప్ గెలుపుపై విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రపంచ మహిళల వరల్డ్ కప్ గెలుపుపై సోమవారం మోడరన్ కళాశాల విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా జయహో భారత్, కంగ్రాట్యులేషన్స్ టీం ఇండియా అని నినాదాలు చేశారు. మోడరన్ కాలేజీ నుంచి మెయిన్ రోడ్ రాజగోపాల్ సెంటర్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు మాట్లాడుతూ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలో భారత మహిళల జట్టు అద్భుతమైన ప్రదర్శన కనపరిచిందని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారిణి శ్రీచరణి చక్కని ఆటతీరుతో ఆకట్టుకుందన్నారు. భారత మహిళల టీమ్ మొత్తం సమిష్టిగా ఆడి విశ్వవిజేతగా నిలవడం గొప్ప విషయమన్నారు. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎంఎస్ఎంఇ పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక కాపు కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు గనిశెట్టి వీరేష్, కడలి భీమేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల లబ్ధిదారులు ఉదయం 9 గంటలకు సంబంధిత ప్రదేశానికి చేరుకుని 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్'ను ఉచితంగా చేసుకోవచ్చునని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, వ్యక్తిగత బ్యాంకు ఖాతా పాస్ బుక్, రేషన్ కార్డు, ఆధార్‌కు లింకు అయిన మొబైల్ నెంబర్ తీసుకురావాలని కోరారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - అంబాజీపేట

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు సూచించారు. సోమవారం మండలంలోని తొండవరంలో మురుగు నీరు మళ్లించి, బ్లీచింగ్ చల్లే పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో పరిసరాలలో మురుగునీరు, చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రతకి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతంగా జీవించవచ్చని హెల్త్ అసిస్టెంట్ ఎవిఎస్ఆర్.ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రామలింగరాజు

పంచాయతీ కార్యదర్శి ఎం.లోవరాజు, ఇజి జి.మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.



రవికుమార్ దీక్షకు సంఘీభావం తెలియజేస్తున్న బిఎస్‌పి నాయకులు

రవికుమార్ దీక్షకు బిఎస్‌పి సంఘీభావం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్ స్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమెల్లి రవి కుమార్ చేపట్టిన రిలే దీక్షకు బిఎస్‌పి నాయకులు సంఘీభావం తెలిపారు. స్థానిక సమైఖ్యాంధ్ర శిబిరం వద్ద రవికుమార్ చేస్తున్న రిలే దీక్ష సోమవారం నాటికి 24వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రయాణికుల ప్రయోజనాలకు నష్టం కలిగించే విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తాల రమణ, కప్పల సత్యనారాయణ, పందు అప్పలస్వామి, క్రాంతి రణదీప్, పోతుల సుందరరావు పాల్గొన్నారు.

తాడి శ్రీనివాసరెడ్డికి పితృవియోగం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడకు చెందిన టిఎన్‌టియుసి నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్ తాడి శ్రీనివాస్ రెడ్డి తండ్రి తాడి సూర్యనారాయణ రెడ్డి సోమవారం రాత్రి మృతి చెందారు. గడిచిన 5 రోజుల క్రితం ఆయన స్వల్ప అస్వస్థతకు లోనయ్యాడు. రావులపాలెం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. అయితే సోమవారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, టిడిపి మండల నేతలు సంతాపం వ్యక్తం చేశారు.



తాడి సూర్యనారాయణరెడ్డి

విశ్రాంతి భవనం ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రాపురం

స్థానిక ఏరియా హాస్పిటల్‌లో రోగుల కోసం నిర్మించిన విశ్రాంతి భవనాన్ని మున్సిపల్ ఛైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం సోమవారం ప్రారంభించారు. భవనాన్ని నిర్మించిన అబ్దుల్ కరీంను పలువురు అభినందించారు. ఈ భవనాన్ని జనాబ్ అబ్దుల్ కరీం తల్లిదండ్రులు జ్ఞాపకార్థం నిర్మించారు. విశ్రాంతి భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ హాస్పటల్ సిబ్బంది, వైసిపి నాయకులు గాదంశెట్టి శ్రీధర్, గడి గోవిందు, మున్సిపల్ కో-ఆప్షన్ నెంబర్ మస్తాన్, ముస్లిం పెద్దలు, వార్డు సభ్యులు అమ్మాజీ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
ఒ.ఎస్. నెం. 237/2025

బిట్వీన్:
సత్తి సత్యనారాయణరెడ్డి -వాది
మరియు
1) గీసాల శ్రీను
2) పిల్లి ముని -ప్రతివాదులు

టు:
1వ ప్రతివాది: గీసాల శ్రీను, తండ్రి: అర్జునరావు, డోర్ నెం. 3-31, నందరాడ, రాజమహేంద్రవరం జె.సి.జె.సి.
2వ ప్రతివాది: పిల్లి ముని, భర్త: నాగేశ్వరరావు, డోర్ నెం. 3-61, నందరాడ, రాజమహేంద్రవరం జె.సి.జె.సి.

పై నెంబరు ప్రతివాదులు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా గాని, రిజిష్టర్ పోస్టు ద్వారా గాని నోటీసులు పంపినప్పటికి వారు సదరు నోటీసును పుచ్చుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. అందు నిమిత్తం శ్రీ కోర్టు వారు వారికి పేపరు పబ్లికేషన్ ద్వారా దావా సమనులు ప్రచురించవల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసినారు. ఆ ప్రకారం సదరు ప్రతివాదులు **దివి. 14-11-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల ప్రతివాదులను ఎక్స్‌పార్టీ చేసి వారి పరోక్షమందు సదరు దావా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

పి.వి.వి.ఎస్.బి.రాజు
జి.సత్యనారాయణ
వాది తరుపున అడ్వకేట్స్, రాజమండ్రి

నోటీసు
మహారాజశ్రీ రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడి వారి కోర్టులో
E.A. No. 119/2025 in
E.P. No. 39/2023 in
O.S. No. 205/2020

Between:
1. తాలాబత్తుల శాంతి ప్రకాష్‌కుమార్
2. తాలాబత్తుల మణికుమారి
-పిటీషనర్స్/ DHr's
AND
గంధం రాజు -రెస్పాండెంట్/ JDr

To:
గంధం రాజు, S/o. వీరన్న, 44 సం॥లు, వ్యాపారం, డోర్ నెం. 2-3-6, ఆదియాంధ్రపేట, కొత్తూరు, రామచంద్రపురం, రామచంద్రపురం మండలం, రామచంద్రపురం JCJC
-రెస్పాండెంట్/ JDr

పై నెంబరు EA 119/2025 కి సంబంధించి రెస్పాండెంట్/ JDr యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 07-11-2025 వాయిదాగా అయి ఉన్నది. కాబట్టి మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది: 07-11-2025
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

టి.వి.నారాయణరెడ్డి
ఎస్.రామ్మూర్తి
DHr తరపు అడ్వకేట్స్, అనపర్తి
సెల్: 9849484239

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, అమలాపురం
I.A. 611/2022, I.A. 612/2022, I.A. 613/2022
F.D.A. No. 4/2021
O.S. No. 114/2016

Between:
నంద్యాల రామ్‌గోపాల్ -పిటీషనర్
అండ్
నంద్యాల వెంకటస్వామి వగైరాలు -రెస్పాండెంట్స్

Proposed 6th Respondent:
నంద్యాల రత్నం, W/o. late సత్యనారాయణమూర్తి, డో.నెం. 1-8/1, తాండవపల్లి గ్రామము, అమలాపురం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పై నెంబరు దావాలో మిమ్ములను Proposed LR గా జాయిన్ చేయుటకు వేసిన పిటీషన్స్‌లో మీ హాజరు నిమిత్తం వాయిదా **తేది. 13-11-2025 నాటికి కలదు.** సదరు తేదీన పై కోర్టులో **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

అమలాపురం **కొమ్ముల వెంకట బుచ్చిరాజు**
30-10-2025 అడ్వకేట్, అమలాపురం